

ఆధిపత్య పోరుతోనే శేషాద్రి హత్య

మదనపల్లెలో సంచలనం సృష్టించిన పుంగనూరు శేషాద్రి హత్య కేసు మిస్టరీ వీడింది. ఆధిపత్య పోరులో భాగంగానే శేషాద్రిని హత్య చేశారని పోలీసులు నిర్ధారించారు. -10లో



స్కానింగ్ పేరుతో రోగి జేబుకు చిల్లు

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలో స్కానింగ్ సెంటర్లు వ్యవహరిస్తున్నాయి. ప్రజారోగ్యంతో దోబూచులాడుతున్నాయి. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.290	రూ.360
రెండోరకం	రూ.210	రూ.278

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 769 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మూడు రోజులు మద్యం అమ్మకాలు బంద్

రాయచోటి(జగదాంబ సెంటర్): కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల లెక్కింపు సందర్భంగా ఈ నెల 3, 4, 5వ తేదీలలో మద్యం అమ్మకాలపై నిషేధం విధిస్తున్నట్లు ఎస్పీ బి.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హోటళ్లు, లాడ్జీలలో తనిఖీలు నిర్వహించి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని ఆయన సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

అక్రమాలపై విచారణ

కడప అగ్రికల్చర్: కడప డీసీఎంఎస్ కార్యాలయ పరిధిలోని స్థల లీజులు, కార్యాలయ లిఫ్ట్ ఏర్పాటుతోపాటు కొంతమంది సిబ్బంది నియామకంపై అక్రమాలు చోటు చేసుకున్నాయని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన విచారణకు ఆదేశించారు. దీంతో పొద్దుటూరు డివిజనల్ లెవెల్ కో–ఆపరేటివ్ ఆఫీసర్(డీఎల్‌సీఓ) సురేష్‌కుమార్ కడప డీసీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా కార్యాలయంలో కొంతమంది సిబ్బందితోపాటు పాలక వర్గానికి చెందిన చైర్ పర్సన్ దండు చంద్రలీల, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, శంకర్, శిరోమణిలను ఆయన విచారించారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలిసింది. ఈ విషయం గురించి సురేస్‌కుమార్‌తో మాట్లాడగా సిబ్బందితోపాటు పాలక వర్గానికి చెందిన వారిని విచారించామని తెలిపారు.

ప్రశాంతంగా కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 59001 నుంచి 75 వేల మధ్య ర్యాంకులు వచ్చిన 138 మంది విద్యార్థులు హాజరై తమకు సంబంధించిన ర్యాంకులు, సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారని పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. శనివారం 75001 నుంచి 92000 వరకు ర్యాంకులు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్లు, ర్యాంకులను పరిశీలన చేయనున్నట్లు సీహెచ్ జ్యోతి తెలిపారు.

వెబ్ కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులు

కడప ఎడ్యుకేషన్: పదోతరగతి పాస్, పాలిసెట్ అర్హత సాధించిన విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ కోసం నిర్వహించే పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ తేదీల్లో మార్పులు జరిగాయి. జూన్ 3న జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో 6వ తేదీన జరుగుతుందని కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. మే 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ఉన్న వెబ్ అప్షన్ల తేదీలు కూడా మారినట్లు తెలిపారు. పాలిసెట్ ఆప్షన్లను జూన్ 7 నుంచి 10వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఎంపికైన కాలేజీల్లో విద్యార్థులు జూన్ 14 నుంచి 19లోగా రిపోర్టు చేసుకోవాలన్నారు. జూన్ 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పాలిసెట్ కో ఆర్డినేటర్ తెలిపారు.

వంటింట.. కూరగాయాలు


- మార్కెట్లో మండిపోతున్న కూరగాయల ధరలు
- భగ్గుమంటున్న పప్పుదినుసుల ధరలు



గుర్రంకొండ/రాయచోటి: సామాన్యుడు మార్కెట్లోకి అడుగుపెట్టాలంటే హడలెత్తిపోతున్నాడు. ఓవైపు కూరగాయాల ధరలు మండిపోతుంగా మరోవైపు పప్పుదినుసుల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో జనాల జేబుకు చిల్లులు పడుతున్నాయి. సంసార సాగరం ఈదలేక నడిసంద్రంలో కొట్టుమిట్టాడుతున్నారు. నెల రోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యులు కళ్లు తేలేస్తున్నారు. వ్యాపారస్తులు పాడిందేపాటగా అడిగిన మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. కాగా కూరగాయల సాగు దారుణంగా పడిపోవడంతోనే రెండు నెలల క్రితం సాధారణంగా ఉన్న కూరగాయాల ధరలు నేడు నాలుగురెట్లు అధికమయ్యాయని వ్యాపారులు అంటున్నారు.

మార్కెట్‌కెళితే రూ.500 కావాల్సిందే..

కూరగాయల కోసం మార్కెట్‌కు వెళితే ఓమోస్తరు కుటుంబమైతే 500 రూపాయలు తప్పనిసరిగా ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. వారపు సంతల్లో చవకగా కూరగాయలు లభిస్తాయనేది ప్రజల నమ్మకం. సామాన్య,మధ్యతరగతి కుటుంబం వారపు సంతకు రూ. 200నుంచి రూ.250 డబ్బులు తీసుకెళితే కూరగాయలు రకానికి ఒకటి చొప్పున అరకిలో కొనుగోలు చేసి ఆకుకూరలు, పండ్లతో సహా కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్లేవారు. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. రూ. 500 నుంచి రూ. 650 వరకు తీసుకెళ్లినా ఇప్పుడున్న కూరగాయల ధరలకు సగం సంచులు కూడా నిండడం లేదని



మహిళలు వాపోతున్నారు. నెలన్నరరోజులుగా కూరగాయల ధరల పెరుగుదల అడ్డూ అదుపు లేకుండా పోతోందని మహిళలు వాపోతున్నారు.

భగ్గుమంటున్న దినుసుల ధరలు



మార్కెట్లో పప్పుదినుసుల ధరలు భగ్గుమంటున్నాయి. ఓవైపు పెరిగిన కూరగాయాల ధరలతో సామాన్య ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు పప్పుదినుసుల ధరలు సైతం చుక్కలనంటాయి. కిలో ఉద్ది పప్పు రూ. 200, కిలో వేరుశెనగ గింజలు రూ.125, కందిపప్పు రూ. 200 ,నూనెలలు కంపెనీలను బట్టి రూ: 115 నుంచి రూ. 140 వరకు లీటరు ధరలు ఉన్నాయి. సామాన్యుడు ఇడ్లీ, దోస చేసుకోవాలంటే పైన చెప్పిన సరుకులు తప్పక కొనితీరాల్సిందే. ఈలెక్కన కనీసం ఒకొక్కటి ఒక్కో కిలో కొనుగోలు చేయాలంటే రు. 650 వరకు ఖర్చు చేయాల్సిందే.

సాగు తగ్గడం వల్లే..

మండుతున్న ఎండలతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.. ఫలితంగా పంటల సాగు గణనీయంగా తగ్గింది. ఇదివరకు జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటలతో సమానంగా ఆకుకూరలు, కూరగాయలు పంటలు రైతులు సాగు చేసేవారు. అయితే అరకొరగా సాగు కావడం.. దిగుబడులు కూడా తగ్గాయి. వీటికి తోడు ఇటీవల కురిసిన అకాల వర్షాలూ పంటలను దారుణంగా దెబ్బతీశాయి. దీంతో పలు పట్టణాల మార్కెట్లలో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి.

- జిల్లాలో అధికంగా సాగయ్యే టమోటా కిలో రూ.30 నుంచి రూ.50 పలుకుతోంది. మిరప రూ.120కి చేరగా, చిక్కుడు కిలో ధర వంద రూపాయలకు చేరింది. బీన్స్ కిలో రూ.150కు పెరిగింది. కొన్ని కూరగాయల ధరలు సెంచరీ దాటాయి.

కొన్నాళ్లంతే..

జిల్లాలోని మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి, రాయచోటి, రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో కూరగాయలు పండించే వారు. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు ఇతర దూర ప్రాంతాల నుంచి కూరగాయలను రవాణా చేసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి కూరగాయలు మరో నెల రోజుల దాకా తక్కువగానే వస్తాయని కూరగాయల రైతు రామసుబ్బారెడ్డి చెప్పారు. తక్కువ కూరగాయలు రావడం వల్ల ధరలు అమాంతం పెంచక తప్పలేదని మరో రైతు శ్రీనివాసులు పేర్కొన్నారు.

- నియోజకవర్గ కేంద్రాల్లోని మార్కెట్‌లు రైతుబజార్లతో పాటు వారాంతపు సంతల్లోనూ కూరగాయల ధరలు అనూహ్యంగా పెరగడంతో తాము కొనేటట్టు లేదు. తినేటటట్టు లేదని గాలివీడుకు చెందిన రజిత అనే గృహిణి ఆవేదనగా చెప్పారు. కూరగాయల ధరలు గణనీయంగా పెరగడంతో వంటిల్లు నిర్వహణ భారం పెరిగిందని, మంట పెట్టకుండానే కూరగాయలు ఉడికి పోతున్నాయని మరో గృహిణి భవానీ చెప్పారు. ఈ వేసవి చివరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలు తగ్గాయని రాయచోటి మార్కెట్ వ్యాపారి జాకీర్‌హుస్సేన్ చెప్పారు.

కూరగాయల రకాలు	ధరలు(కిలో)
పచ్చిమిర్చి	రూ.100
టమాటాలు	రూ.60
బీన్స్	రూ.150
ఉల్లగడ్డలు	రూ.50
మునగ	రూ.60
వంకాయ	రూ.80
క్యారెట్	రూ.60
ఉల్లిపాయలు	రూ.40
వెల్లుల్లి	రూ.200
కాకర	రూ.70
బెండకాయలు	రూ.60
మొటిక్కాయలు	రూ.50
ముల్లంగి	రూ.50
బీరకాయలు	రూ.40
ఆకుకూరలు	రూ.30

ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూరగాయల రవాణా

ఢిల్లీ, ఇండోర్ నుంచి ఆలుగడ్డలు, రాంచీ నుంచి బీన్స్ వస్తున్నాయని, దూరాభారం నుంచి కూరగాయలు తెప్పించుకోవాల్సి రావడం వల్ల రవాణా ఖర్చుల భారం వల్ల ధరలు పెరిగాయని కూరగాయల మార్కెట్ కమిషన్ ఏజెంట్ కొత్తిమీర ప్రసాద్ చెప్పారు. కర్ణాటకలోని బెల్లాగం శ్రీనివాసపురం నుంచి సన్న మిర్చి తెప్పించుకోవడం వల్ల రవాణా ఛార్జీలు పెరిగాయని రౌనక్‌బాషా పేర్కొన్నారు.

కూరగాయలు కొనలేకున్నాం



మార్కెట్లోకూరగాయలు కొనలేకపోతున్నాం. ధరలు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయి. వారంలో సగం సంపాదనంతా కూరగాయలకే సరిపోతోంది. రూ.500 తీసుకెళ్లినా ఒక కుటుంబానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. ఇలాగైతే సంసారం గడవడం చాలా కష్టం. ధరలు అదుపులో ఉంటే ఓ ముద్ద తినగలం. పెరిగిన ధరలు సామాన్యులు మోయలేకున్నారు.

– లక్ష్మీదేవి, బీసీ కాలనీ, గుర్రంకొండ

కూరగాయలు దిగుమతి చేసుకొంటున్నాం



ఒకప్పుడు మేమే స్వయంగా కూరగాయలు పండించి మార్కెట్లకు తీసుకొచ్చి అమ్ముకొనే వాళ్లం. నేడు మేమే బయట ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకొచ్చి మార్కెట్లో వ్యాపారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పండించిన కూరగాయలైతే సామాన్యులకు అందుబాటులో ఉండేలా ధరలు ఉండేవి. నేడు ఆ పరిస్థితి లేదు. అధిక మొత్తం వెచ్చించి కూరగాయలు కొనాల్సిన పరిస్థితి నెలకొంది.

– పుల్లక్క, వ్యాపారి, కొత్తపల్లె

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- కౌంటింగ్ కేంద్రంలో క్రమశిక్షణతో మెలగాలి
- కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్



ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: కౌంటింగ్ కేంద్రంలో క్రమశిక్షణతో మెలిగి సజావుగా, ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా సహకరించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం అభిషిక్త్ కిషోర్ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు కోరారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో రాజంపేట పార్లమెంట్ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు కౌంటింగ్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిమిత్తం చేస్తున్న ఏర్పాట్లు, కౌంటింగ్ హాల్స్ లేఅవుట్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, కౌంటింగ్ హాలులో పాటించాల్సిన నియమాలు గురించి వివరించారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు విధానం, కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, ఫుడ్ అరేంజ్మెంట్, వాహనాల పార్కింగ్, కమ్యూనికేషన్ హాల్, మీడియా ఫెసిలిటేషన్ సెంటర్, త్రిలేయర్ సెక్యూరిటీ విధానం తదితర అంశాలలో తీసుకున్న చర్యలను అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు వివరించారు. కౌంటింగ్ ప్రక్రియపై ఎన్నికల కమీషన్ జారీ చేసిన ఆదేశాలు, సూచనలను పక్కాగా పాటిస్తామని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలో అత్యంత ప్రతిష్టంగా మూడు లేయర్ల బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అల్లరి, సమస్యలు సృష్టిస్తే అలాంటి వారిని కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు పంపడమే కాకుండా హద్దు మీరి ప్రవర్తించిన వారిని అరెస్టు చేయవచ్చునని ఎన్నికల కమిషన్ స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. అంతకు ముందుగా రాయచోటి ఆర్డీఓ రంగస్వామి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ విధివిధానాలను అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లకు స్పష్టంగా వివరించారు. డీఆర్ఓ సత్యనారాయణ రావు, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరింటెండెంట్ నరసింహారావు, పార్లమెంట్ అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విత్తన కాయల నాణ్యతలో రాజీ వద్దు



రైతులతో కలసి వేరుశనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న డీఏఓ చంద్రానాయక్

రాయచోటి టౌన్/లక్కిరెడ్డిపల్లె: ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల్లో నాణ్యత లోపిస్తే వెంటనే వెనక్కు పంపాలని డీఏఓ చంద్ర నాయక్ రైతు భరోసా కేంద్రాలలో విధులు నిర్వర్తించే వ్యవసాయ సహాయకులకు సూచించారు. మే 29వ తేది నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వేరుశనగ కాయలు సబ్సిడీ ధరలకు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన శుక్రవారం రాయచోటి రూరల్ పరిధిలోని దిగవ అబ్బవరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కె–6 రకం వేరుశనగ కాయలు 35323 క్వింటాళ్లు, నారాయణి రకం వేరుశనగకాయలు 18046 క్వింటాళ్లు. టీసీజీఎస్ రకం వేరుశనగ కాయలు 900 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి వేరుశనగ కాయల రకం 1114 క్వింటాళ్లు సబ్సిడితో అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాలకు డిమాండ్ ఆధారంగా నిల్వ ఉంచామని చెప్పారు. విత్తన కాయలు తీసుకెళ్లిన రైతు తప్పకుండా సాగు చేయాలన్నారు. విత్తనాలు సాగు చేయకపోతే ఆ రైతు విత్తనం పూర్తి ధర చెల్లించాలని హెచ్చరించారు. రైతు భరోసా కేంద్రాలలో ఉన్నవిత్తన కాయలలో నాణ్యత లోపిస్తే వెంటనే ఆ లోడును వెనక్కు పంపించాలని సూచించారు. విత్తన కాయలు పంపిణీ చేసే సమయంలో అధికా రులు విత్తన స్టాక్ రిజిస్టర్, క్వాలిటీ అసెస్మెంట్ రిజి స్టర్, సీడ్ డిలవరీ చలానా, సీడ్ జర్మినేషన్, వేరుశనగ కాయల ధరల పట్టిక సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం, చౌటుపల్లి రైతు భరోసా కేంద్రాలను డీఏఓ పరిశీలించి రైతులకు విత్తన కాయలను పంపిణీ చేశారు. ఏఓ బాబురావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఏఏఓ పాల్గొన్నారు.

క్షణ క్షణం.. అప్రమత్తం!

- రాయచోటి సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ..బైండోవర్
- 17 నుంచి 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు



అసాంఘిక శక్తుల చర్యలను అడ్డుకునే విధానాన్ని తెలియజేస్తున్న పోలీసులు

సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సమయం సమీపించే కొద్ది అందరిలోనూ ఒకటే ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే గెలుపోటములపై పార్టీలో అంచనాలు ఎంత వేసుకుంటున్నా...కౌంటింగ్‌పై మాత్ర నరాలు తెగే సస్పెన్స్ కొనసాగుతోంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అల్లర్లు, గొడవలు చెలరేగిన నేపథ్యంలో పోలీసుశాఖ ప్రత్యేక చర్యలకు ఉపక్రమించడంతోపాటు ఎక్కడికక్కడే అనుక్షణం అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టింది. ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా జిల్లా ఎన్నికల అధికారులతోపాటు పోలీసుశాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. కౌంటింగ్ హాలులో బారికేడ్లు మొదలుకొని ఫెన్సింగ్ ఏర్పాటు, ఏజెంట్ల గుర్తింపు కార్డులతోసహా ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు అడుగులు ముందుకు వేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో ఆరు నియోజకవర్గాలతోపాటు రాజంపేట పార్లమెంటు స్థానానికి సంబంధించిన కౌంటింగ్ రాయచోటిలో నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

కట్టుదిట్టమైన భద్రత మధ్య కౌంటింగ్

రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కట్టుదిట్టమైన భద్రత మధ్య కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఏజెంట్లు మొదలుకొని అభ్యర్థులను, మీడియా ప్రతినిధులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే లోనికి అనుమతించనున్నారు. ఇప్పటికే కౌంటింగ్ కేంద్రం వద్ద మూడెంచల భద్రత కొనసాగుతోంది. ఈనెల 4వ తేదిన కౌంటింగ్‌ను పురస్కరించుకుని రాయచోటి–కడప ప్రధాన రహదారిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే రహదారిని పూర్తిగా పోలీసులు అదుపులోకి తీసుకుని రాకపోకలను మూసివేయనున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్టును అమలు చేస్తున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో ఈనెల 3వ తేది నుంచి మూడు రోజులపాటు మద్యం షాపులు కూడా మూసి వేయాలని ఆదేశించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్...

కౌంటింగ్‌ను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. స్టేషన్‌కు పిలిపించి కౌంటింగ్ రోజు ఎవరూ కూడా ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అంతేకాకుండా ఎక్కడికక్కడ సమస్యాత్మక ప్రాంతాల్లో జిల్లా వ్యాప్తంగా గుర్తించి 114 చోట్ల ప్రత్యేకంగా పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. అన్ని పార్టీలకు సంబంధించిన సుమారు 7500 మందికి పైగా బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ వద్ద హాజరు పరిచి ఘర్షణలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

తొలి ఫలితం తంబళ్లపల్లెదే

అన్నమయ్య జిల్లాలో తొలి ఫలితం తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి వెలువడే అవకాశం ఉంది. మిగతా నియోజకవర్గాల కంటే తక్కువ రౌండ్లు (17) కలిగిన తంబళ్లపల్లె సెగ్మెంట్ తొలి ఫలితం వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఆ తర్వాత 18 రౌండ్లతో రైల్వేకోడూరు, అలాగే కొంతమేర అటు, ఇటుగా మదనపల్లె ఫలితం వచ్చేలా కనిపిస్తోంది. ఆ తర్వాత పీలేరు, రాజంపేట, అత్యధికంగా 21 రౌండ్లతో ఉన్న రాయచోటి చివరి ఫలితంగా వచ్చే అవకాశం ఉంది. ఒక్కో నియోజకవర్గంలోని 14 టేబుళ్లను కలిపి ఒకరౌండుగా పరిగణిస్తారు. మే 13న జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని 1609 పోలింగ్ కేంద్రాల పరిధిలో 77.8 శాతం పోలింగ్ నమోదైంది.

క్లుప్తంగా

యథేచ్ఛగా కలప రవాణా



లారీలో అక్రమంగా తరలిస్తున్న వేప, మామిడి కలప

వీరబల్లి : వీరబల్లి మండలం గుర్రప్పగారిపల్లి పంచాయతీ నుంచి కలప అక్రమంగా తరలిపోతోంది. అటవీ అధికారులు చూసీ చూడనట్లు ఉండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. శుక్రవారం గుర్రప్పగారిపల్లి పంచాయతీ నుంచి ఇలా మామిడి, వేప కలపను లారీలలో తరలిస్తున్నారు. చెక్ పోస్టు వద్ద అధికారులతో జతకలిసి అక్రమార్కులు ఈ కలప అక్రమంగా తరలించేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇసుక టిప్పర్ స్వాధీనం



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

లక్కిరెడ్డిపల్లి : తక్కెడుపల్లె ఎక్సైజ్ పరిధిలోని గాలివీడు మండలం గరుగుపల్లె ఏరు నుంచి నూలివీడుకు ఇసుక తరలిస్తుండగా శుక్రవారం టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్, ఇసుకను గాలివీడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. వంకలు, చెరువు ప్రాంతాలలో నిఘాపెట్టి అక్రమ ఇసుక రవాణాను అరికడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది మోహన్‌రెడ్డి, నాగరాజు, ఈసీ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు మండలం గండికోట కొట్టాల గ్రామానికి చెందిన మహీంద్ర(32) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఏఎస్ఐ మురళీ మోహన్ వివరాల మేరకు.. గండికోట కొట్టాల గ్రామానికి చెందిన మల్లే మహీంద్ర స్థానిక గాలిమరల కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి భార్య వరలక్ష్మీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల కిందట కుమారుడు చనిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో శరీరంపై డీజిల్ పోసుకోని నిప్పంటించుకున్నాడు. ప్రొద్దుటూరు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. భార్య వరలక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

స్కానింగ్ పేరుతో.. రోగి జేబుకు చిల్లు

- నిబంధనలకు వ్యతిరేకంగా స్కానింగ్ కేంద్రాల నిర్వహణ
- ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కంటే అధికంగా వసూళ్లు
- అనుభవం లేని టెక్నీషియన్లతో రోగ నిర్ధరణ పరీక్షలు

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలో స్కానింగ్ సెంటర్లు వ్యవహరిస్తున్నాయి. ప్రజారోగ్యంతో దోబూచులాడుతున్నాయి. రోగి పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరితో కుమ్మక్కై అవసరం లేకున్నా స్కానింగ్ పేరుతో జేబుకు చిల్లులు పెడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు దోచుకునేందుకు తయారయ్యాయి. అధిక రుసుము వసూలు చేస్తున్నా.. అవేమీ పట్టించుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు.

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలో 117 స్కానింగ్ సెంటర్లకు అనుమతులు ఉన్నాయి. వాటిలో దాదాపు మదనపల్లెలో 69 స్కాన్ సెంటర్లు ఉన్నాయి. ఇవిగాక అనధికారికంగా మరిన్ని కేంద్రాలు నడుస్తున్నాయి. కొన్ని చోట్ల స్కానింగ్ చేశాక ఫలితాలను అనలైజ్ చేయాల్సిన రేడియాలజిస్ట్ లేకుండానే నివేదిక సిద్ధం చేసి పంపుతున్నారు. రెఫరల్ డాక్టర్లకు కమీషన్ ఇచ్చి.. స్కానింగ్ కేంద్రాల్లో ప్రదర్శించిన ధరలు కాకుండా అధిక మొత్తం వసూలుచేస్తున్నారు. బిల్లు ఇవ్వకపోగా, డిజిటల్ పేమెంట్లను అంగీకరించడం లేదు. కేవలం నగదు మాత్రమే ఇవ్వాలని, లేకుంటే చేసేది లేదని ఖరాఖండిగా చెపుతున్నారు. ఆస్పత్రిలో పనిచేసే కొంత మంది వైద్యులు బయట స్కానింగ్ సెంటర్లలో చేసే పరీక్షల్లో రిపోర్ట్ కచ్చితంగా ఉంటుందని చెప్పి మరీ పంపుతున్నారు. అధికారుల తనిఖీలు శూన్యం కాగా.. ఆయా సెంటర్ల నిర్వహణలో కొందరు భాగస్వాములుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

డెకాయ్ ఆపరేషన్లు ఏవీ?

పట్టణంలోని కొన్ని స్కానింగ్ సెంటర్లలో చట్టవిరుద్ధంగా రహస్య లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వాటికి సంబంధించి పీసీపీఎన్‌డీటీ కమిటీ ఉన్నప్పటికీ, ఇటీవల కాలంలో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రతినెలా కలెక్టర్, ఆర్డీఓ అనుమతితో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలి. ఎన్‌జీఓలు తప్పకుండా ఉండాలి. ఒక వేళ తనిఖీలు చేసినా వారిపై చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. నోటీసులు ఇచ్చి సరిపెడుతున్నట్లు తెలుస్తోంది. వైద్యాధికారులు మామూళ్లు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు చెలరేగిపోతున్నారు.



రెయిన్‌బో ఆస్పత్రిలో నడుపుతున్న స్కాన్ మెషిన్‌కు సీల్ వేస్తున్న వైద్యాధికారులు

అనధికారికంగా నిర్వహణ...

పట్టణంలో పలు స్కానింగ్ కేంద్రాలు అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్యురాలి అనుమతి లేకుండానే స్కానింగ్ వ్యవహారాలు సాగించారు. గతంలో ఆదిత్య స్కానింగ్ సెంటర్ పేరుతో నడిచిన చోట కొత్తగా రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ నడుస్తోంది. ఈ ఆస్పత్రికి అనుమతులు లేకపోవడంతో తనిఖీకి వెళ్లిన వైద్యాధికారులకు అనధికారికంగా ఓ ప్రభుత్వ వైద్యురాలు స్కానింగ్ చేయడం గుర్తించారు. వైద్యాధికారులు ఆమెపై చర్యలు తీసుకోకపోగా, పైపెచ్చు...ఆదిత్య స్కానింగ్ సెంటర్‌లో ఆరు నెలలుగా వైద్యురాలు లేకపోవడంతో స్కాన్ మెషిన్ వాడటం లేదని, దాన్ని డీకమీషనింగ్ చేయాలని యాజమాన్యం కోరడంతో సీల్ చేసినట్లు క్లీన్ చిట్ ఇచ్చారు.

> **తప్పు చేస్తే ... ఉపేక్షించం**
>
> స్కానింగ్ సెంటర్లు వైద్య చట్టాలకు లోబడే ఉండాలి. బాధితులు ఎవరైనా ముందుకు వచ్చి స్కానింగ్ సెంటర్ల దోపిడీపై ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. పట్టణంలో మొబైల్ వ్యాన్‌ల ద్వారా, కొన్ని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. వాటన్నింటిపై నిఘా పెట్టి, పోలీసుల సహాయంతో సీజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
>
> – డాక్టర్.దేవశిరోమణి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ

రేపటి నుంచి నల్లగంగమ్మ తిరుణాల

కేవీపల్లె : మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో నల్లగంగమ్మ తిరుణాల ఆదివారం నుంచి నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించనున్నారు. రాత్రి చాందినీ బండ్లతో భక్తులు ఆలయ ప్రదక్షిణ చేస్తారని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సోమవారం ఉదయం అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో రూ.1.29 లక్షల చోరీ

మదనపల్లె : ఆన్‌లైన్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఖాతా నుంచి రూ.1.29 లక్షలు కాజేసిన వైనం మదనపల్లె పట్టణంలో శుక్రవారం జరిగింది. మదనపల్లి టూటౌన్ పోలీసులు, సైబర్ క్రైమ్ సిబ్బంది వివరాల మేరకు.. మదనపల్లె పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బద్రీనాథ్ తన స్మార్ట్ ఫోన్‌లో ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు క్రెడ్ యాప్‌ను ఉపయోగిస్తున్నాడు. గురువారం సాయంత్రం తన ఖాతా నుంచి రూ.2 లక్షలు డ్రా చేసినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావడంతో అవాక్కయ్యాడు. తన అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి నగదు చోరీ చేశారని గుర్తించి, క్రెడ్ యాప్‌లో ఫిర్యాదు చేశాడు. వారు వెంటనే స్పందించడంతో రూ.70వేలు రికవరీ చేయగలిగారు. మిగిలిన రూ.1,29,495, రూపాయలు సైబర్ నేరగాళ్లు తీసుకున్నారు. బాధితుడు శుక్రవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశాడు.

గండిలో హనుమజ్జయంతి వేడుక




హోమం నిర్వహిస్తున్న పురోహితులు, ప్రత్యేక అలంకరణలో గండి వీరాంజనేయుడు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో హనుమజ్జయంతి వేడుక శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మెన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో అర్చకులు బుధవారం నుంచి హోమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శుక్రవారం మూల విరాట్‌ను పుష్పాలతో అలంకరించి త్రికాల ఆరాధన, చతుస్థానార్చన, మన్యుసూక్త హోమం, మూలమంత్ర హోమం, స్నపన తిరుమంజనం, లఘుపూర్ణాహుతి, గోష్ఠి తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు జరిపారు. శనివారం ప్రత్యేక పూజలతోపాటు చక్రాయపేట వేంకటేశ్వర రాచరాయ స్వామి ఆలయం ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర(మోటార్ సైకిల్ ర్యాలీ)గండి నుంచే ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపారాయణదారు రామ్మోహన్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఆధిపత్య పోరుతోనే శేషాద్రి హత్య

- డీఎస్పీ ప్రసాదరెడ్డి
- ఏడుగురు నిందితుల అరెస్ట్ చూపిన పోలీసులు
- మారణాయుధాలు, ఇన్నోవా, ఆటో, టూవీలర్ సీజ్




శేషాద్రి హత్య కేసు నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, హత్యకు వాడిన మారణాయుధాలు

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన పుంగనూరు శేషాద్రి హత్య కేసు మిస్టరీ వీడింది. ఆధిపత్య పోరులో భాగంగానే శేషాద్రిని అంతమొందించినట్లు పోలీసులు నిర్ధారించారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన పుంగనూరు శేషాద్రి ఈ నెల 24న హత్యకు గురికాగా, సీఐలు యువరాజు, వలిభాషా, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, ఇనయతుల్లా, తాలూకా ఎస్ఐ వెంకటేష్‌లతో కలిపి నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద నిందితులు పారిపోయేందుకు ఉపయోగించిన ఇన్నోవా వాహనంతోపాటు, హత్య సమయంలో వినియోగించిన ఆటో, టూవీలర్, ఏడు కత్తులు, సమ్మెట స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి హత్యకు కారణాలు తెలుసుకున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. వారికి ఇన్నోవా వాహనాన్ని సమకూర్చిన ముద్ర, హరిలను కేసులో ముద్దాయిలుగా చేర్చామన్నారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్ఐ, ఇతరులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

పక్కా ప్రణాళికతో... హత్య

పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన పుంగనూరు శేషాద్రి, గొల్లపల్లెకు చెందిన కొండుపల్లె ఆనంద్ ఓ ప్రజాసంఘంలో సభ్యులుగా ఉంటూ భూదందాలు, వివాదాల పరిష్కారం చేసేవారు. ఇటీవల ఇరువురి మధ్య మనస్పర్థలు వచ్చి విభేదాలు పెరగడంతో శేషాద్రి, కొండుపల్లె ఆనంద్ నుంచి విడిపోయాడు. బహుజన భీమ్‌సేన పేరుతో ప్రజాసంఘాన్ని స్థాపించి సొంతంగా సెటిల్‌మెంట్ చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే కొండుపల్లె ఆనంద్, శేషాద్రి స్నేహితుడైన నాగరాజుపై దాడి చేశారు. దీంతో ఆనంద్‌కు ఫోన్‌లో వార్నింగ్ ఇవ్వడంతోపాటు చంపేస్తానని శేషాద్రి బెదిరించాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆనంద్(40) ఈ నెల 24న రాత్రి 12 గంటలకు తన అనుచరులైన తుపాకుల మణికంఠ(23), బండి మహేష్(28), సాతిపడి రాజశేఖర్(40), మొరంపల్లె చరణ్‌కుమార్(23), ముసిలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అలియాస్ చెన్నారెడ్డి(28), పఠాన్ నజీర్‌ఖాన్(27)తో కలిసి శేషాద్రిని హత్యచేసేందుకు కుట్ర చ ఏశారు. అతడు నివాసం ఉంటున్న మంజునాథకాలనీకి ఆటో, టూవీలర్‌లో వెళ్లి జనసంచారం లేకపోవడంతో, గేటు తీసి లోపలికి వెళ్లారు. ఇంట్లో నిద్రిస్తున్న శేషాద్రి, అతడి భార్య కమల బాత్ రూమ్‌లోకి వెళ్లి గడియపెట్టుకోగా.. తలుపులు పగలగొట్టి శేషాద్రిని మిద్దెపైకి తీసుకెళ్లారు. అక్కడ మాటామాటా పెరగడంతో ఆనంద్ కత్తితో తలపైన నరికారు. ప్రాణభయంతో శేషాద్రి తప్పించుకుని ఇంట్లోకి వెళ్లగా అతడిని బయటికి ఈడ్చుకువచ్చారు. తన భర్తను చంపవద్దని భార్య ప్రాధేయపడినా వినకుండా విచక్షణారహితంగా కసితీరా నరికి చంపేశారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన రామాజుల

పీలేరురూరల్ : కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రేగళ్లులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రేగళ్లు కస్పాకు చెందిన పూజా రాజ భార్య రామాంజులు(37) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. శుక్ర వారం కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫంకాకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి కుమార్తె ఆవేక వుంది.

కమలాపురం దర్గా సందర్శన



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, తదితరులు

కమలాపురం : కర్నూలు జిల్లా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు కమలాపురంలోని దర్గా-ఎ-గఫారియా, జహీరియాను శుక్రవారం దర్శించుకున్నారు. కాటసాని తన కుటుంబ సభ్యులతో కలిసి దర్గా పీఠాధిపతి ఫైజుల్ గఫార్ షాఖాద్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్వామివారి మజార్ల వద్దకు వెళ్లి పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి కుటుంబ సభ్యులు కాటసాని దంపతులను సన్మానించారు. దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ దర్గా విశిష్టత, స్వామి చరిత్రను కాటసానికి వివరించారు. కాటసాని మాట్లాడుతూ దర్గాను దర్శించు కోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్న అత్తింటివారిపై బాధితురాలు రేవతి ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. మదనపల్లి పట్టణం ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆనంద్‌నాయుడు కుమార్తె సి.రేవతిని సుండుపల్లె మండలం చప్పిడివాండ్లపల్లెకు చెందిన చంద్రయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు సి.రమేష్‌తో 14ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారుల సంతానం . వివాహ సమయంలో 300 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఇటీవల అనారోగ్య కారణాలతో రమేష్ సైనిక ఉద్యోగం నుంచి విరమణ చెంది స్వగ్రామం వచ్చేశాడు. నూతన ఇంటి నిర్మాణం చేపట్టేందుకు కోటి రూపాయలు తేవాలని ఆయన కోరినట్లు భార్య రేవతి తెలిపారు. అందుకు ఒప్పుకోకపోవడంతో రమేష్, తన తల్లిదండ్రులతో కలిసి వేధిస్తున్నారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. శుక్రవారం పుట్టింటికి వచ్చిన రేవతి స్థానిక టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త రమేష్ అత్త లక్ష్మీదేవి, మామ చంద్రయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఇనయతుల్లా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భానుడి ఉగ్రరూపం..!



- మండుతున్న ఎండలు
- రోహిణి కార్తెలో అధిక ఉష్ణోగ్రతలు
- వేడి సెగలు, ఉక్కపోతలతో ప్రజల ఉక్కిరిబిక్కిరి

జిల్లాలో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

మండలం	ఉష్ణోగ్రత
పెనగలూరు	42.3
నందలూరు	41.6
ఓబులవారిపల్లె	40.3
రాజంపేట	40.8
పుల్లంపేట	41.3
రాయచోటి	39.1
మదనపల్లె	37.2
పీలేరు	37.8
తంబళ్లపల్లె	38.0

మదనపల్లె సిటీ : రోహిణి కార్తె ప్రభావం .. జిల్లాలో ఎండలు అల్లాడిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. రెండు,మూడు రోజులుగా జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతుండటంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. వామ్మో ఇవేం ఎండలంటూ జనం బెంబెలెత్తుతున్నానరు. ఒక వైపు వేడిగాలులు..మరో వైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరో వారం రోజులు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎండవేడి, ఉక్కపోతతో పాటు ఊపిరి ఆడని విధంగా వాతావరణం మారిపోయింది. జిల్లాలో 42.3 నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో నిప్పుల కొలిమిలా మారింది. జనం బయటకు రాకపోవడంతో ఉదయం నుంచి రహదారులన్ని నిర్మానుషంగా మారుతున్నాయి.

పెరిగిన ఎండలు, వేడిగాలుల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావడం మంచిది కాదని అటు అధికార యంత్రాంగం, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 11 గంటల లోపు పనులు చూసుకుని ఎండ తీవ్రత తగ్గిన తర్వాత సాయంత్రం సమయంలో మాత్రమే బయటకు రావాలని సూచిస్తున్నారు. ఒక వేళ అవసరం రీత్యా బయటకు వచ్చినా తాగు నీరు, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలని, తలపై టోపీ లేదా గొడుగు వంటివి వినియోగించాలని సూచిస్తున్నారు. డీహైడ్రేషన్, వడదెబ్బ తగలకుండా తాగునీరు, కొబ్బరినీళ్లు, గ్లూకోజ్, ఓఆర్ఎస్, మజ్జిగ, పండ్ల రసాలు వంటివి ఎక్కువగా తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు వహించాలని, వడగాలులు, వేడి వాతావరణానికి దూరంగా ఉంచాలని వైద్యులు అంటున్నారు. ఎండ తీవ్రతకు తల తిరిగినా, నోరు పొడిబారిపోయినా, వడదెబ్బ తగినట్లు అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

> **వడగాలులతో జాగ్రత్త**
>
> 
>
> రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వడగాలులు వీస్తున్నాయి. ఎండలలో పని చేసేవారికి వడదెబ్బ తగిలే ప్రమాదముంది. ఎవరైనా వడదెబ్బ గురైతే వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. తడి బట్టతో శరీరమంతా తుడిచి, చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. ఓఆర్ఎస్ ద్రావణం తాగించి, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.
>
> – డాక్టర్ వెంకటరామయ్య, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, తంబళ్లపల్లె

అనంత, నెల్లూరు జట్ల విజయం

సెంచరీలు సాధించిన వంశీకృష్ణ, ఖాద్రి



ఫర్హద్‌ఖాద్రి (102పరుగులు)



టి.వంశీకృష్ణ (100 పరుగులు)



అర్జున్‌టెండూల్కర్ (61పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో జరిగే ఏసీఏ అంతర్ జిల్లాల సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 47.4 ఓవర్లలో 289 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని పి.అర్జున్ టెండూల్కర్ 34 బంతుల్లో 7ఫోర్లు, 4 సిక్సర్‌లతో 61 పరుగులు, బి.వినయ్‌కుమార్ 51 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 52 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు రెడ్డి ప్రకాష్ 4, వర్షిత్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 32.3 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని ధరణినాయుడు 26 పరుగులు చేశారు. అనంత బౌలర్లు దీపక్ సాయి 2 వికెట్లు తీశాడు. దీంతో అనంతపురం జట్టు 143 పరుగుల భారీ ఆధిక్యంతో విజయం సాధించింది.

కడప జట్టుపై నెల్లూరు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 46.1 ఓవర్లలో కడప జట్టు 229 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని టి.వంశీకృష్ణ 128 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సర్‌తో 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. నెల్లూరు బౌలర్లు భరత్ 4, అఖిల్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 36.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. జట్టులోని ఫర్హద్ ఖాద్రి 94 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సర్‌లతో 102 పరుగులతో నాటౌట్‌గా రాణించాడు. ఈయనకు జతగా నిఖిలేష్ 56 పరుగులు చేశాడు. కడప బౌలర్ మహ్మద్ రఫీ 2 వికెట్లు తీశాడు. కాగా నెల్లూరు జట్టు 8 వికెట్ల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది.